క్లుప్తంగా

21న గురుపౌర్ణమి ఉత్సవం

మండవల్లి: స్థానిక శ్రీ దత్తపరంపర సహిత షిరిడీ సాయిబాబా మందిరంలో ఈ నెల 21న గురుపౌర్ణమి పురస్కరించుకుని ఉత్సవం నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహకులు గుడివాడ చిట్టిబాబు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం ఎనిమిది గంటలకు పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. 9 గంటలకు వ్యాసుడికి గురుపూజ కార్యక్రమం నిర్వహిస్తామని తెలిపారు. 9.30 గంటలకు సామూహిక సత్య వ్రతాలు, మధ్యాహ్నం 12 గంటల నుంచి అన్నసమారాధన నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. రాత్రి ఏడు గంటలకు పల్లకి ఉత్సవం నిర్వహిస్తారని తెలిపారు.

తాగునీటి ట్యాంకుల శుభ్రతకు చర్యలు



తోట్లవల్లూరు: తోట్లవల్లూరులో తాగునీటి ట్యాంకుల పరిశుభ్రతకు పంచాయతీ చర్యలు చేపట్టింది. వర్షాల నేపథ్యంలో గ్రామంలో ఎలాంటి తాగునీటి సమస్యలు తలెత్తకుండా ఉండేందుకు పంచాయతీ సర్పంచ్ పెనుమత్స రాధిక చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా స్థానిక నార్తువల్లూరు, సౌత్‌వల్లూరు, కలాసు మాలపల్లి గ్రామాలకు నీటి సరఫరా చేసే రక్షిత తాగునీటి ట్యాంకులను ఆదివారం పంచాయతీ సిబ్బంది కడిగి శుభ్రం చేశారు. పంచాయతీ కార్యదర్శి పుష్పనాథం, సిబ్బంది పర్యవేక్షించారు.

మొవ్వ విద్యార్థినికి ట్రిపుల్ ఐటీలో సీటు



బందారు నిఖిత

మొవ్వ: మొవ్వ గ్రామంలోని శ్రీ మండవ కనకయ్య జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థిని బందారు నిఖిత 2023–24 విద్యా సంవత్సరం పది పరీక్షల్లో 580 మార్కులు సాధించి ట్రిపుల్ ఐటీలో సీటు సాధించింది. నూజివీడు ట్రిపుల్ ఐటీ కళాశాలలో ప్లేస్‌మెంట్ సాధించినట్లు ఆ పాఠశాల హెచ్‌ఎం సూర్యదేవర శ్రీదేవి ఆదివారం తెలిపారు. నిఖితకు పాఠశాల హెచ్‌ఎంతో పాటు ఉపాధ్యాయులు విద్యాకుటుంబం తమ అభినందనలు తెలిపారు.

కనకదుర్గమ్మకు ఆషాఢ సారె



ముదినేపల్లి రూరల్: మండలంలోని వడాలి శ్రీకనకదుర్గమ్మ ఆలయంలో కొలువైయున్న అమ్మవారికి భక్తులు ఆదివారం ఆషాఢ మాస సారెను సమర్పించారు. స్థానిక వెలమపేట రామాలయం నుంచి శ్రీ జగన్నాథస్వామి ఆలయం మీదుగా ఆలయానికి ఊరేగింపుగా తరలి వెళ్లారు. నక్కా అప్పారావు ఆధ్వర్యంలో అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి, సారెను సమర్పించారు.

మంత్రులకు సన్మానం



కైకలూరు: స్థానిక సీఎన్నార్ గార్డెన్‌లో ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ ఆధ్వర్యంలో గృహనిర్మాణ, సమాచార పౌర సంబంధాలశాఖ మంత్రి కొలుసు పార్థసారథి, భూగర్భ, గనులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర, ఎంపీ పుట్టా మహేష్ కుమార్ యాదవ్‌ను నాయకులు ఆదివారం ఘనంగా సన్మానించారు. రాష్ట్రంలో ఎన్డీఏ కూటమి కలయిక చివరి వరకు కొనసాగిస్తామని మంత్రులు అన్నారు. మాజీ ఎమ్మెల్సీ కమ్మిలి విఠల్‌రావు అధ్యక్షత వహించగా మాజీ ఎమ్మెల్యేలు రావి వెంకటేశ్వరరావు, ఘంటా మురళీ, చేపల రైతు సంఘ రాష్ట్ర అధ్యక్షుడు నంబూరి వెంకట్రామరాజు పాల్గొన్నారు.

తాడిగడపలో బాలిక అదృశ్యం

పెనమలూరు: తాడిగడప గ్రామంలో బాలిక అదృశ్యంపై పోలీసులు ఆదివారం కేసు నమోదు చేశారు. పెనమలూరు పోలీసుల కథనం మేరకు తాడిగడప ఇంజినీరింగ్ కాలేజీ ఎదురుగా ఉన్న అపార్ట్‌మెంట్‌లో ఉంటున్న వ్యక్తికి భార్య, ఇద్దరు పిల్లలు. ఇతని కుమార్తె (16) ఈ నెల 11వ తేదీ మధ్యాహ్నం ఆటోనగర్ గేట్ వద్ద ఉన్న తన స్నేహితురాలి ఇంటికి వెళ్లి వస్తానని ఇంట్లో చెప్పి తిరిగి రాలేదు. దీంతో బాలికకు ఫోన్ చేయగా సెల్ ఫోన్ స్విచ్చాఫ్ వచ్చింది. ఆటోనగర్ గేట్ వద్ద ఉన్న స్నేహితురాలి ఇంటికి వెళ్లి వాకబు చేశారు. ఆ బాలిక కూడా అదృశ్యమైనట్లు గుర్తించారు. ఇద్దరూ ఇంట్లో చెప్పకుండా వెళ్లిపోయారు. ఈ ఘటనపై మొదటి బాలిక తండ్రి ఇచ్చిన ఫిర్యాదుపై పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

ఊపందుకున్న ఖరీఫ్ పనులు

నియోజకవర్గంలో 90 వేల ఎకరాల్లో వరి సాగు



పామర్రులో వరి సాగుకు పొలం దమ్ము చేస్తున్న రైతులు



కురుమద్దాలిలో మడిని సిద్ధం చేస్తున్న రైతులు

పామర్రు: నియోజకవర్గంలో ఖరీఫ్ సాగు పనులు ఊపందుకున్నాయి. మూడు రోజులుగా విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. దీంతో రైతులు దమ్ము చేసి వరి నాట్లు వేస్తున్నారు. నియోజకవర్గ పరిధిలోని ఐదు మండలాల్లో సుమారు 90 వేల ఎకరాల్లో వరి సాగు చేసేందుకు రైతులు సిద్ధమవుతున్నారు. నియోజకవర్గంలో రైతులు పుల్లేరు, నాగులేరు కాలువలపై ప్రధానంగా ఆధారపడి వరిసాగు చేస్తున్నారు. వ్యవసాయ కూలీల కొరతతో కొన్నేళ్లుగా వెదజల్లు, డ్రమ్ సీడర్ పద్ధతిలో నాట్లు వేసేందుకు రైతులు మొగ్గు చూపుతున్నారు. నియోజకవర్గంలో సుమారు 80 శాతం వరకు వెదజల్లు పద్ధతిలో నాట్లు వేస్తున్నట్లు వ్యవసాయ అధికారులు తెలిపారు. ఈ పద్ధతిలో నాట్లు వేస్తే పెట్టుబడి తగ్గుతోందని రైతులు చెబుతున్నారు. నియోజకవర్గంలో వర్షాలు కురియడంతో రైతులు సాగు పనుల్లో బిజీగా ఉన్నారు. వర్షాలు కురవడం, పుల్లేరు, నాగులేరు కాలువలకు నీరు విడుదల చేయడంతో పామర్రు, తోట్లవల్లూరు మండలాల్లోని మెట్ట గ్రామాల రైతులు సైతం ఖరీఫ్ పనులు ప్రారంభించారు. నియోజకవర్గంలోని పలువురు రైతులు ప్రకృతి వ్యవసాయం చేస్తున్నారు. ఈ పద్ధతిలో వ్యవసాయం చేయడం రైతులకు ఆరోగ్యకరమైన పంట చేతికొస్తోందని వారు చెబుతున్నారు. వ్యవసాయాధికారులు గ్రామాల్లో పొలంబడి నిర్వహించి రైతులకు పలు సూచనలు, సలహాలు ఇస్తున్నారు.

ముమ్మరంగా వరినాట్లు



తోట్లవల్లూరులో వరినాట్లు వేస్తున్న కూలీలు

తోట్లవల్లూరు: మండలంలో వరినాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి. మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలతో మాగాణి భూములు నీటి తటాకాలుగా మారిపోయాయి. సాగునీటి సమస్యతో ఇబ్బంది పడుతున్న రైతులకు వర్షాలు బాగా ఊరటనిచ్చాయనే చెప్పొచ్చు. పొలాల్లో వర్షం నీరు ఎక్కువగా చేరటంతో రైతులు పొలాలను దమ్ము చేయించే పనుల్లో నిమగ్నమయ్యారు. వరినారు అదనుకు రావటం, వర్షాలు ఆశాజనకంగా కురుస్తుండటంతో వరినాట్ల పనులు వేగవంతంగా సాగుతున్నాయి. స్థానికులతోపాటు ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన వలస కూలీలు వరినాట్ల పనుల్లో పాల్గొంటున్నారు.

సలహాలు పాటిస్తున్నాం

వర్షాలు కురవడంతో నియోజకవర్గంలో ఖరీఫ్ సాగు పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. రైతు భరోసా కేంద్రాల్లో విత్తనాలు, ఎరువులు అందజేస్తున్నారు. వ్యవసాయాధికారుల సూచనలు, సలహాలు పాటించి సాగు పనులు చేస్తున్నాం.

–కొల్లి సత్యనారాయణరెడ్డి, రైతు, పామర్రు

వెదజల్లే పద్ధతికే ప్రాధాన్యం

వ్యవసాయ కూలీల కొరత కారణంగా సుమారు 80 శాతం మంది రైతులు వెదజల్లు పద్ధతిలో వరి సాగు చేస్తున్నారు. మండలంలో వరి నాట్లు జరుగుతున్నాయి. పుల్లేరు, నాగులేరు కాలువ జలాలపై ఆధారపడి రైతులు వరి సాగు చేస్తున్నారు. ప్రభుత్వం అందిస్తున్న సదుపాయాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలి.

– శివ నాగరాణి, ఏఓ, పామర్రు

తాగునీరు విడుదల



వింజరం లాకుల వద్ద నీటిని విడుదల చేస్తున్న ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్

కైకలూరు: ప్రకాశం బ్యారేజీ నుంచి వచ్చిన నీటిని వింజరం లాకుల వద్ద గేట్లు ఎత్తి పోల్‌రాజ్ కాల్వకు ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ ఆదివారం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టిసీమ నీరు ప్రకాశం బ్యారేజీకి చేరడంతో ఆ నీటిని ప్రభుత్వం విడుదల చేసిందన్నారు. రాష్ట్ర తలసరి ఆదాయంలో 660 మండలాలను అధిగమించి నియోజకవర్గంలో కలిదిండి, కైకలూరు మండలాలు ఒకటి, రెండు స్థానాల్లో నిలిచాయన్నారు. ఇందుకు కారణం ఆక్వా రంగమే అని తెలిపారు. తాగునీటి చెరువులు నింపిన తర్వాత ఆక్వా చెరువులకు అవకాశం కల్పిస్తామన్నారు. కాల్వల మరమ్మతులకు మండల స్థాయిలో కమిటీలను ఏర్పాటు చేస్తామన్నారు. సాగునీటి కాల్వల పూడికతీత పనుల్లో అక్రమాలకు పాల్పడితే విజిలెన్స్ తనిఖీలు చేయిస్తామన్నారు. ఇరిగేషన్ అధికారులు మాట్లాడుతూ పోల్‌రాజ్ కాల్వకు 350 క్యూసెక్కుల నీరు విడుదల చేశామన్నారు. వింజరం, తాడినాడ, అరుతెగళపాడు, దొడ్డిపట్ల, కొండూరు, రామవరం వరకు నీరు చేరుతోందన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ కమ్మిలి విఠల్‌రావు, సర్పంచ్ ధర్మరాజుల నాగమణి, ఇరిగేషన్ ఈడీ విశ్వకుమార్, ఏఈలు రాజగోపాలరావు, కిషోర్, కూటమి నాయకులు వీరమల్లు నరసింహారావు, పూల రాజీ, కొల్లి బాబీ, బలే ఏసురాజు, వీరాబత్తిన సుధా, నర్సిపల్లి అప్పారావు, పైడిపాటి శివశంకర్, పేరిచర్ల ప్రసాదరాజు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు సన్మానం

ఎమ్మెల్యే కామినేనిని కైకలూరులో కామాక్షి పట్టణ స్వర్ణకార సంఘం ఆధ్వర్యంలో వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో సన్మానించారు. సంఘ నాయకులు అనుపోజు నాగేశ్వరరావు, టేకి సత్యనారాయణ(అబ్బు), కర్రి కోటేశ్వరరావు, జయాచారి పాల్గొన్నారు.

యాదవులు ఐక్యంగా ఉండాలి



నూతన కమిటీ సభ్యులకు నియామకపు ఉత్తర్వులను అందిస్తున్న శ్రీరాం

పామర్రు: యాదవులు అందరూ ఐక్యంగా ఉన్నప్పుడే సమస్యలు పరిష్కారం అవుతాయని అఖిల భారత యాదవ సంఘ జాతీయ కమిటీ సభ్యులు వీర్ల శ్రీరాం యాదవ్ పేర్కొన్నారు. స్థానిక గుడివాడరోడ్డులోని శ్రీ శ్రీనివాసా రెసిడెన్సీలో యాదవ మహా సభ కమిటీ సమావేశం ఆదివారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యాదవులందరూ ఒక్క తాటిపై నిలబడాలన్నారు. యాదవ సంఘాల హక్కులను పరిరక్షించుకోవడానికి అందరూ కలిసి కృషి చేయాలన్నారు. అనంతరం పామర్రు నియోజకవర్గ యాదవ సంఘ సభ్యులను ఎంపిక చేశారు.

నియోజకవర్గ సంఘ అధ్యక్షుడిగా గొరిపర్తి నాగబాబు, కార్యదర్శిగా జొన్నలగడ్డ సురేష్‌ను నియమించారు. కార్యక్రమంలో అఖిల భారత యాదవ కమిటీ జనరల్ సెక్రటరీ అంగడాల పూర్ణచంద్రరరావు యాదవ్, జోన్ అధ్యక్షుడు పెద్దబోయిన శ్రీనివాస్ యాదవ్, పొల్ల రాజా యాదవ్, తోటకూర ఆదినారాయణ యాదవ్ పాల్గొన్నారు.

పెట్రోల్ బంక్‌లను తనిఖీ చేయాలి



విలేకరులతో మాట్లాడుతున్న ఆర్‌సీపీ రెడ్డి

గుడివాడ టౌన్: పట్టణంలో అన్ని పెట్రోల్ బంక్‌లను కంపెనీ వారితో పాటు రాష్ట్ర ప్రభుత్వ అధికారులు తరచుగా తనిఖీలు చేయాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు ఆర్‌సీపీ రెడ్డి డిమాండ్ చేశారు. స్థానిక సీపీఎం కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఇటీవల కాలంలో పెట్రోలు బంక్‌ల తనిఖీలు సక్రమంగా జరగకపోవడంతో కల్తీ పెట్రోలు అమ్మకాలకు అవకాశం ఏర్పడుతుందన్నారు. ఇటీవల ఓ బంక్‌లో పెట్రోల్‌లో నీరు కలిసిందని వినియోగదారులు ఆందోళన చేపట్టారన్నారు. బంక్ యజమానులు సాంకేతిక సమస్య వలన అలా జరిగి ఉంటుందని, కల్తీకి ఆస్కారం లేదని వారు చెబుతున్నారన్నారు. అధికారికంగా తనిఖీలు నిర్వహిస్తే ప్రజల్లో నమ్మకం కలుగుతుందన్నారు. తక్షణమే పట్టణంలోని అన్ని పెట్రోల్ బంక్‌లు తనిఖీ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. సీపీఎం నాయకులు ఆర్.కొండ, సమీర్ పాల్గొన్నారు.

అస్తవ్యస్తంగా నేషనల్ హైవే



ఇండియన్ బ్యాంక్ సమీపంలో ఆర్‌అండ్‌బీ రహదారిపై ఏర్పడిన గుంతలు



వెలమపేట సమీపంలో గోతులమయంగా ఉన్న నేషనల్ హైవే

మండవల్లి: అధికారులు మండవలిల్లో విజయవాడ, భీమవరం ఆర్‌అండ్‌బీ రహదారిని నేషనల్ హైవేగా రూపొందించారు. కాని పట్టించుకునే నాథుడు లేక అస్తవ్యస్తంగా మారింది. ఈ రహదారిపై గుంతలు పడటంతో వర్షం నీరు నిలిచి ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. భారీ వాహనాల రాకపోకలకు గుంతల్లోని వర్షపు నీరు ప్రయాణికులపై పడి ఇబ్బందులు పడుతున్నారు. మండవల్లి ఇండియన్ బ్యాంక్ సమీపంలో, వెలమపేట వద్ద అధ్వానంగా మారిన రహదారితో పలు సమస్యలు ఎదుర్కొంటున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి రహదారిని అభివృద్ధి చేసి ప్రజల సమస్యలు పరిష్కరించాలని పలువురు కోరుతున్నారు.

ముగిసిన వారాహి మహోత్సవాలు



అమ్మవారికి పూజలు చేస్తున్న మహిళలు

గుడివాడ టౌన్: స్థానిక వాసవిచౌక్‌లో వేంచేసియున్న శ్రీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి దేవస్థానంలో నిర్వహిస్తున్న వారాహి నవరాత్రి మహోత్సవాలు ఆదివారం ముగిశాయి. తొమ్మిది రోజులుగా వారాహి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పామర్రు వాసవీ విదర్భపురి మహిళలు అమ్మవారికి ఆషాఢ సారెను సమర్పించారు. ఆదివారం అధిక సంఖ్యలో మహిళలు పాల్గొని పూజా కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ పాలక మండలి అధ్యక్షుడు జవ్వాజి గంగరాజు, ఎస్.మురళీకృష్ణ, టంగుటూరి వెంకట సుబ్బారావు, సముద్రాల వెంకట జగ్గారావు, ఐతా గోపాలకృష్ణ, చిన్నం గంగాధర్ పాల్గొన్నారు.

జీవనశైలి, ఆహారపు అలవాట్లతో హృద్రోగ సమస్యలు



రోగులను పరీక్షిస్తున్న గుండె వైద్య నిపుణులు కృష్ణచంద్

పమిడిముక్కల: ప్రస్తుత జీవనశైలి, ఆహారపు అలవాట్లు ఇతర కారణాలతో పలువురికి వయస్సుతో సంబంధం లేకుండా హృద్రోగ సమస్యలు ఎదురవుతున్నాయని ప్రముఖ గుండె వైద్య నిపుణులు కాగిత కృష్ణచంద్ అన్నారు. విజయవాడ సెంటినీ హాస్పిటల్ వారి ఆధ్వర్యంలో తాడంకి గ్రామంలో ఆదివారం ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. వైద్య శిబిరాన్ని సర్పంచ్ జంపాన ధనలక్ష్మి ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో కృష్ణచంద్ మాట్లాడుతూ ప్రతిఒక్కరూ వ్యాయామం, మంచి ఆహారపు అలవాట్లతో పాటు వైద్య నిపుణుల సూచనలు తీసుకుని ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవాలని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలకు నిపుణుల వైద్య సేవలు అందాలనే ఉద్దేశంతో ఉచిత వైద్య శిబిరాలను ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఆరోగ్య సమస్యలు గుర్తించిన వారికి విజయవాడలోని సెంటినీ హాస్పిటల్‌కు తీసుకువెళ్లి అవసరమైన వైద్య సేవలు, ఆరోగ్యశ్రీ పథకం పరిధిలో ఉన్న ఆపరేషన్లు ఉచితంగా చేయనున్నట్లు సెంటినీ హాస్పిటల్ పేషెంట్ కేర్ ఏజీఎం పెదబాబు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యురాలు శ్రీలక్ష్మి, వైఎస్సార్ సీపీ నాయకులు యేనుగ మస్తాన్‌రావు, కూచిపూడి వీరాస్వామి పాల్గొన్నారు.

17న చినకంచిలో ప్రత్యేక పూజలు

నున్న(విజయవాడరూరల్): తొలి ఏకాదశి సందర్భంగా ఈ నెల 17వ తేదీన శ్రీశ్రీశ్రీ చంద్రశేఖరేంద్ర సరస్వతిస్వామి దేవస్థానం చినకంచిలో ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ ట్రస్టీ మొక్కపాటి శర్మ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. తొలి ఏకాదశి నాడు విష్ణుమూర్తికి ప్రీతికరమైన పేలాల పిండిని ప్రసాదంగా పెట్టడం జరుగుతుందని పేర్కొన్నారు. అదేవిధంగా భక్తులు కూడా పేలాలపిండి తీసుకుని ఉపవాసం ఉంటారని తెలిపారు. విష్ణుమూర్తి తొలిఏకాదశి రోజు నుంచి రెండు నెలల పాటు అనగా కార్తీక శుద్ధ ఏకాదశి వరకు నిద్రలో ఉంటారని పేర్కొన్నారు. విష్ణు ఆలయాల్లో శ్రీ వెంకటేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించి అభిషేకాలు, అర్చనలు చేస్తారని తెలిపారు.

నేటితో గుప్త నవరాత్రులకు స్వస్తి

నాగాయలంక: స్థానిక కృష్ణానదీ తీరంలో శ్రీకనకదుర్గమ్మ ఆలయం ఆధ్వర్యంలో ప్రప్రథమంగా నిర్వహించిన శ్రీవారాహి అమ్మవారి ఆషాఢ గుప్త నవరాత్రుల ఉత్సవాలు జయప్రదంగా కొనసాగిన నేపథ్యంలో సోమవారం ఈ ఉత్సవాలకు స్వస్తి పలుకనున్నట్లు శ్రీరామ క్షేత్రం కమిటీ చైర్మన్ ఆలూరి శ్రీనివాసరావు తెలిపారు. ఉత్సవాల్లో భాగంగా ఆదివారం తొమ్మిదో రోజు వారాహి అమ్మవారు లలితాదేవి రూపంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ అర్చకుడు అచ్యుత శేఖర శర్మ తెల్లవారు జామున 5గంటలకు ముదునూరి శ్రీనివాసశాస్త్రి, కళావతి దంపతులు వారాహిదేవికి శాస్త్రోక్తంగా కుంకుమ పూజ జరిపి ధూప దీప నైవేద్యాలు సమర్పించారు. సాయంత్రం పూజా క్రతువులో పలు జంటలు పీటలపై కూర్చున్నారు. భక్తులు అధిక సంఖ్యలో లలితాదేవిగా కొలువైన వారాహి మాతకు మంత్రపుష్ప నీరాజనాలు సమర్పించారు.

సుబ్బారాయుడి దర్శనానికి పోటెత్తిన భక్తులు

ముదినేపల్లి రూరల్: ప్రసిద్ధి చెందిన సింగరాయపాలెం–చేవూరుపాలెం సెంటర్‌లోని శ్రీ సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయానికి భక్తులు ఆదివారం పోటెత్తారు. జిల్లాలోని నలుమూలల నుంచి అధిక సంఖ్యలో భక్తులు ఉదయాన్నే ఆలయానికి చేరుకున్నారు. స్వామివారి పుట్టలో పాలు పోయడం మొదలు పాల పొంగళ్ల శాల వద్ద నైవేద్యాలు తయారు చేసేందుకు సైతం భక్తులు పోటీపడ్డారు. నాగబంధాలు, గోశాల వద్ద మహిళలు భారీ ఎత్తున పూజలు చేశారు. సహాయ కమిషనర్ నేల సంధ్య, సిబ్బంది పర్యవేక్షణ చేశారు.

మూడు ఇసుక ట్రాక్టర్ల స్వాధీనం

పెనమలూరు: యనమలకుదురులో చట్ట విరుద్ధంగా అక్రమంగా ఇసుక తరలిస్తున్న మూడు ఇసుక ట్రాక్టర్లను ఎస్‌ఈబీ అధికారులు సీజ్ చేశారు. యనమలకుదురు ఇసుక క్వారీ కనకదుర్గ వారధికి దగ్గరగా ఉండటంతో ఈ క్వారీని గతంలోనే నిషేధించారు. అయితే ఇసుక మాఫియా అధికార పార్టీ అండదండలతో అడ్డగోలుగా ఇసుకను తరలిస్తున్నారు. ఈ సమాచారం తెలుసుకున్న ఎస్‌ఈబీ అధికారులు ఆదివారం దాడులు చేసి మూడు ఇసుక ట్రాక్టర్లు సీజ్ చేశారు. కాగా చోడవరం ఇసుక క్వారీలో కూడా అడ్డగోలుగా ఇసుక తరలిస్తున్నారు. ఎస్‌ఈబీ, రెవెన్యూ, పోలీసు అధికారులు తక్షణం చర్యలు తీసుకోకపోతే కృష్ణా నదిలో భూగర్భజలాలకు ప్రమాదం ఏర్పడే అవకాశం ఉంది.

సామాజిక అవగాహనపై సదస్సు



నాగాయలంక: రక్షణసైన్యం(సాల్వేషన్ ఆర్మీ) నాగాయలంక డీఓ ఆధ్వర్యంలో సంస్థ స్థానిక కార్యాలయం ఆవరణలో వార్షిక కార్యక్రమంగా జూనియర్ హోమ్ లీగ్ దినోత్సవం ఆదివారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా రక్షణ సైన్యం జిల్లా అధికారి(డీఓ) మేజర్ తెలగతోటి ప్రసాదరావు, మహిళా విభాగం జిల్లా అధికారి మేజర్ దీనరత్నకుమారి నేతృత్వంలో యువతీ యువకులకు (యవ్వనస్తులకు) సామాజిక అవగాహన సదస్సు నిర్వహించారు. వారు మాట్లాడుతూ మద్రాసు ఉమ్మడి రాష్ట్రంగా ఉన్న తెలుగు గడ్డపై 1895లో విజయవాడలో తొలుత స్టాఫ్ కెప్టెన్ అబ్దుల్ అజీజ్ ఈ సంస్థను ప్రారంభించారని, ప్రస్తుతం 700 గ్రామాల్లో హీనస్థితిలో ఉన్న వేలాది మంది అభాగ్యుల సేవలకు సంస్థ అంకితమై పనిచేస్తోందని వివరించారు. ఈ సందర్భంగా యవ్వనస్థులతో సామాజిక ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం ప్రత్యేక ప్రార్థనలు జరిపారు. కార్యక్రమంలో కెప్టెన్ సీహెచ్.వకీలాదేవి, కెప్టెన్ జి.కేజియాకుమారి, లెఫ్టినెంట్ వి.వీరకుమారి తదితర నాయకులు, బాలలు, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

ఉచిత వైద్యశిబిరానికి విశేష స్పందన



వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్

పామర్రు: పామర్రు సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌కు చెందిన ఎన్టీఆర్ ట్రస్టు వారి సౌజన్యంతో స్థానిక సీనియర్ సిటిజన్స్ కార్యాలయంతో ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్యశిబిరానికి విశేష స్పందన లభించింది. ఈ శిబిరంలో 100మందికి పైగా సీనియర్ సిటిజన్స్‌తో పాటు స్థానికులు కూడా వైద్య సేవలను పొందారు. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షుడు చెరుకూరి రాఘవేంద్రరావు మాట్లాడుతూ ఈ శిబిరంలో బీపీ, షుగరు పరీక్షలతో పాటు కంటి, వినికిడి తదితర పరీక్షలను ఉచితంగా నిర్వహించినట్లు తెలిపారు. వైద్యురాలు డాక్టర్ ఆర్ అర్చన రోగులకు వైద్య పరీక్షలను నిర్వహించారు. కార్యక్రమంలో అసోసియేషన్ కార్యదర్శి చిన్నం ఆదినారాయణ, కోశాధికారి చక్రాల లక్ష్మణరాజు, సభ్యులు పూర్ణ, మండా కమలాకరనాథ్, బి.కోటిరెడ్డి, కోటేశ్వరరావు పాల్గొన్నారు.

గోదావరి జలాలకు పూజలు



హనుమాన్‌జంక్షన్ రూరల్: కృష్ణా–ఏలూరు కాలువ ద్వారా విడుదల చేసిన సాగునీరు బాపులపాడు మండలం వీరవల్లికి చేరుకోవడంతో ఆదివారం సాగునీటి సంఘాలు, రైతు నాయకులు పూజలు నిర్వహించారు. గోదావరి జలాలను పట్టిసీమ ఎత్తిపోతల పథకం ద్వారా కృష్ణా డెల్టాకు అందించడంపై వారు హర్షం వ్యక్తం చేశారు. ఏలూరు కాలువ 38వ కిలోమీటరు వద్ద గోదావరి జలాలకు శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించి, హారతి ఇచ్చారు. సాగునీటి సంఘాల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు ఆళ్ల వెంకట గోపాలకృష్ణారావు, రైతు నాయకుడు గుండపనేని ఉమావరప్రసాద్, ఎంపీటీసీ సభ్యులు అమ్మతపల్లి సూర్యనారాయణ, పూసులూరి లక్ష్మీనారాయణ, ఇరిగేషన్ ఏఈఈ ఎల్.తనూజ, వర్క్ ఇన్‌స్పెక్టర్ వై.సత్యనారాయణ పాల్గొన్నారు.